ఇలాగైతే చదివేదెలా..?

సమస్యల వలయంలో చదువుల నిలయం

- తరగతి గదులు, ఫర్నిచర్ కొరత, లేచిపోయిన పైకప్పు
- అమలుకాని ప్రజాప్రతినిధుల హామీ
- ప్రహరీ లేక మందుబాబుల అడ్డా, రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలు


రేకులతో నిర్మించిన తరగతి గదులపై లేచిపోయిన పైకప్పు

సైదాపూర్: రాష్ట్ర ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తుందని ప్రకటించినా అమలుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని సైదాపూర్ సమ్మక్క గుట్ట వద్ద నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఏళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. తరగతి గదుల పైకప్పు లేచిపోయింది. తరగతి గదుల కొరత, ఉన్న గదులకు తలుపులు లేవు. అసంపూర్తి ప్రహరీకి గేట్ లేక హరితహారం మొక్కలు పశువులకు మేతగా మారింది. సాయంత్రం మందు బాబులకు అడ్డాగా మారింది. తరగతి గదుల్లోనే ల్యాబ్ నిర్వహిస్తున్నారు.

సమస్యలున్నా.. పరిష్కారం సున్నా

మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం దొరక్క సైదాపూర్ సమ్మక్క–సారలమ్మ గుట్ట ప్రాంతంలో అరకొర మౌలిక వసతులతో కాలేజీ కొనసాగుతోంది.

- తరగతి గదుల కొరత వెంటాడుతూనే ఉంది. నాణ్యత లోపంతో రేకులతో నిర్మించిన రెండు గదుల పైకప్పు రేకులు లేచిపోయాయి. విశాఖ ట్రస్టు ద్వారా నిర్మించిన రెండు గదులకు కిటికీలు, తలుపులు లేవు.
- ప్రహరీ అసంపూర్తిగా ఉనా గేటు లేదు. హరితహారం మొక్కలను పశువులు మేస్తున్నాయి. కాలేజీ మందుబాబులకు అడ్డాగా మారింది. తరగతి గదుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.
- కాలేజీ మైదానంలో పెద్దపెద్ద గుండ్లు ఉన్నాయి. విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు శారీర, మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తాయని వక్తలు, పాలకులు సభలు, సమావేశాల్లో చెబుతున్నా అలాంటి మైదానం కోసం పాలకులు కృషి చేయడం లేదు.
- కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు తరగతులు కొనసాగుతున్నా సరిపడా తరగతి గదులు లేవు.
- పక్కా భవనం నిర్మించాలని ప్రిన్సిపాల్ ప్రభుత్వం, పాలకులు, అధికారులను పలుమార్లు కోరినా ఫలితం లేదు.
- మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హరితహారంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమారతో కాలేజీలో మొక్కలు నాటారు. గదుల కొరత తీర్చుతానని ఇచ్చినా హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు.
- సైన్స్ గ్రూపు విద్యార్థులకు గదులులేక తరగతి గదుల్లో ల్యాబ్ నిర్వహిస్తున్నారు.
- మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు కాలేజీలో చేరడానికి ఆసక్తి చూపడంలేదని అధ్యాపక బృందం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

- మండలంలోని 26 గ్రామాల నుంచి విద్యార్థులు కాలేజీలో చేరడానికి సిద్ధంగా ఉన్నా సరైన రవాణా సౌకర్యం లేదు. ––అమ్మనగుర్తి, గుండ్లపల్లి, నల్లరామయ్యపల్లి,బొమ్మకల్, రాయికల్, గొడిశాల, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాములపల్లి, వెన్నంపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాలకు పది కిలోమీటర్ల దూరంలో కాలేజీ ఉంది.
- సైకిల్‌పై వచ్చిన విద్యార్థులు నీరసపడి పాఠాలు వినలేకపోతున్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం రెండేళ్ల పెట్టించారు. కరోనా కారణంగా కాలేజీలు మూతపడడంతో భోజనం ఆపేశారు.
- ఇప్పటికైనా అధికారులు, పాలకులు కాలేజీ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పట్టింపులేదు



విద్యా వ్యవస్థపై పాలకులకు, అధికారులకు పట్టింపు లేదు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలేదు. ప్రహరీ లేకపోవడంతో రోజంతా పశువులకు, రాత్రి వేళ మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రహరీతోపాటు అదనపు తరగతి గదులు నిర్మించాలి.

– గాదపాక కుమార్‌రాజా, సామాజిక కార్యకర్త, సైదాపూర్

గదులు సరిపోవడంలేదు



విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. పైకప్పు లేచిపోయినా మరమ్మతులు చేయడం లేదు. తరగతి గదుల్లోనే ల్యాబ్ నిర్వహిస్తున్నాం. ఫర్నీచర్ కొరత, తరగతి గదుల తలుపులు ఊడిపోయాయి. రాత్రి వేళ మద్యం సేవించి మందు సీసాలు గదుల్లో పడేస్తున్నారు.

– సత్యనారాంజనేయులు, ప్రిన్సిపాల్

సాహస కృత్యాలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిగురుమామిడి: మండలంలోని రామంచ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడు, ఎనిమిదో తరగతి విద్యార్థులు జాతీయ సహస కృత్యాలకు ఎంపికయ్యారు. ఈనెల 13 నుంచి 17 వరకు హర్యానాలో జరిగే సాహస కృత్యాల శిబిరానికి తరలివెళ్లారు. పాఠశాలలో స్కౌట్ అండ్ గైడెన్స్‌గా పనిచేస్తున్న షరీఫ్‌అహ్మద్ ఉపాధ్యాయుడి (ట్రైనర్)ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంపికయ్యారు. బోయిని చరణ్‌తి, పైస విష్ణు, కె మనిదీప్, వి. విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ. శ్రీరామ్‌రెడ్డి, వి. రిషితరెడ్డి హర్యానాలోని గఢ్‌పురి నేషనల్ అడ్వెంచర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సాహస కృత్యాల్లో నాలుగు రోజులపాటు పాల్గొంటారని హెచ్‌ఎం ఆర్. విజయలక్ష్మి తెలిపారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, ప్రముఖులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి సాగనంపారు.

విద్యార్థులకు అభినందనలు


సర్టిఫికెట్స్ అందిస్తున్న ఎంపీ బండి సంజయ్

గంగాధర: ఆర్ట్ అండ్ పెయింటింగ్ పోటీల్లో రాణించిన మండలంలోని వివేకానంద విద్యార్థులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అభినందించారు. పోటీల్లో పాఠశాలకు చెందిన కె.అంజలి, స్వాతి, సృజన బహుమతులు సాధించారని, మరో 25 మంది విద్యార్థులు బెస్ట్ ఆర్ట్ వారియర్స్ సర్టిఫికెట్లు పొందారని పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

హెల్త్ డైరీ యాప్‌పై అవగాహన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో హెల్త్ డైరీ యాప్‌పై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ తిరుమల మాట్లాడుతూ... పెళ్లికి ముందు తర్వాత స్త్రీలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని, మధ్యాహ్న భోజనం చేయకపోవడం మూలంగా అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శిరిష, సుజాత, మమత, కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవోఓ హరిసింగ్ కోరారు. మండలంలోని చెల్పూర్ గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొవద్దన్నారు. వెంట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది. తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో పద్మశాలీ సంఘానికి సంబంధించిన భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారు. సంఘం నాయకులు గతేడాది ఆగస్టులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి సంఘానికి చెందిన భూమిలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలంటూ జిల్లా పంచాయతీ అధికారి గ్రామ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. అయినా పట్టించుకోకపోవడంతో పద్మశాలీ సంఘం నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. నిర్మాణాన్ని కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేయగా సోమవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్మాణాన్ని కూల్చివేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న ప్రభాకర్‌యాదవ్

గంగాధర: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్ యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో సోమవారం బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి రావడానికి నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ ప్రభుత్వ జిమ్మిక్కులను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు కల్యాణ్, అశోక్, శ్రీనివాస్, తిరుపతి,శ్రీనివాస్, శ్రీధర్, మహేశ్, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కరోనా కాలంలో పేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ అందించిందని జిల్లా అధికార ప్రతినిధి జానపట్ల స్వామి అన్నారు. మండలంలోని అంబాల్‌పూర్, కేశవపట్నంలో సోమవారం బీజేపి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం, ఆసరా పింఛన్లు, రుణమాఫీ, నిరుద్యోగభృతి ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. మోసం చేసిన నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, కొంరయ్య, రాజిరెడ్డి, నరేశ్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి ,జైపాల్, సంపత్,శివారెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

'ఆరోపణలు చేయొద్దు'

వీణవంక: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు అప్పని హరీశ్‌వర్మ అన్నారు. మండలంలోని రామక్రిష్టాపూర్ గ్రామంలో మాట్లాడారు. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సమర్థవంతంగా పని చేస్తున్నారని, ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని, అన్నివర్గాలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి ప్రభుత్వ విప్ ఇవ్వడం అభినందనీయమని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ దేశ రాజకీయాలను శాసిస్తుందన్నారు.

ఆర్థికసాయం అందజేత

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన కనుకుంట్ల సంతోష్ భార్య ఇటీవల మృతి చెందారు. ఆమె ఆరోగ్యానికి లక్షలు ఖర్చుకావడంతో అప్పుల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఆధార్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కంసాల శ్రీనివాస్ సోమవారం సంతోష్ కుటుంబాన్ని పరామర్శించి ఐదువేల ఆర్థికసాయం అందించాడు. కార్యక్రమంలో అజయ్,శ్యామ్, మునీందర్,జగన్, జితేందర్, జనార్దన్, కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విద్యార్థులకు సూచించారు. వసతిగృహంలో ఉంటూ చదువుకోవడం ఇష్టం లేక ఆదివారం మండలంలోని మధురానగర్ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం పదో విద్యార్థిని మూడంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యా యత్నం చేసింది. గురుకుల విద్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. పరీక్షల పట్ల ఆందోళన చెందొద్దని అర్థం కాకుంటే ఉపాధ్యాయులను కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

భూ నిర్వాసితులకు పరిహారం మంజూరు

నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న మంగపేట భూ నిర్వాసితులకు నిధులు మంజూరు చేయించానమి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రకటనలో పేర్కొన్నారు. 86 ఎకరాల వ్యవసాయభూమి, బావులు కోల్పోతున్న వారికి ప్రభుత్వం రూ.16.50 కోట్లు రూపాయలు మంజూరు చేసిందని, 18 ఏళ్లగా పరిహారం కోసం నిర్వాసితులు పోరాటం చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు.

విద్యార్థుల ఇంటి బాట

గంగాధర: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం విద్యార్థినులు ఇంటిబాట పట్టారు. పదోతరగతి విద్యార్థిని ఆదివారం సాయంత్రం భవనం పైనుంచి దూకి ఆత్మహత్య యత్నం చేయడంతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లలను తీసుకెళ్లారు. విద్యాలయంలో 417 మంది పాఠశాల, 131 మంది కళాశాల విద్యార్థులు ఉన్నారు. దాదాపు సగం మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లినట్టు సమాచారం. ఎందుకు తీసుకెళ్తున్నారని సాక్షి పలువురిని ప్రశ్నించగా ఆదివారం జరిగిన సంఘటనకు పిల్లలు భయపడ్డారని రెండు మూడు రోజుల తర్వాత మళ్లీ తీసుకువస్తామని సమాధానం ఇచ్చారు.

తడి, పొడి వరిసాగుపై అవగాహన


మాట్లాడుతున్న ఏఈవో సౌమ్య

గన్నేరువరం: తడి, పొడి విధానంలో వరి సాగుపై వ్యవసాయశాఖ, పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మాదాపూర్ రైతువేదికలో క్లస్టర్ పరిధిలోని మాదాపూర్, హన్మజిపల్లె, గోపాల్‌పూర్ గ్రామ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో సౌమ్య మాట్లాడుతూ... ఈ విధానంలో వరి సాగు చేసే ప్రతి రైతుకు ఎకరానికి రూ.800లు స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఇస్తామని తెలిపారు. నీరు ఆదాతో పాటు మొక్క వేర్లకు గాలి చేరుకోవడంతో బలంగా ఎదుగుతుందని వివరించారు. అధిక పిలకలు రావడంతో దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంటుందని వివరించారు. సాగు చేయాలనుకునే రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి సంపత్, సంస్థ కోఆర్డినేటర్ అనూష పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై రాస్తారోకో


మధురానగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయాలని, నారాయణపూర్, చర్లపల్లి,మంగపేట, ఇస్తారుపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి సోమవారం కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారి మధురానగర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. భారీ వర్షాలకు మంగపేట, నారాయణపూర్ చెరువు కట్టలు తెగిపోయినా మరమ్మతులు చేయడంలేదన్నారు. నియోజకవర్గంలో వేల ఎకరాల్లోని యాసంగి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి చెరువుకట్టల మరమ్మతు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్,శ్రీనివాసరెడ్డి, నారాయణ, దుబ్బాసి బుచ్చయ్య, మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కోల రమేష్, హరీష్ , శ్రీనివాస్‌గౌడ్,గంగయ్య, జీవన్‌రెడ్డి, లక్ష్మణాచారి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పోస్టర్ ఆవిష్కరణ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీ మహాలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఉత్సవాల కరపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్‌లు సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాలు 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రావికంటి సదాశివుడు, బీఆర్ఎస్ నాయకులు భోగం వెంకటేశ్, సభ్యులు ధర్మేందర్, కోరే సతీష్, పంజాల అనిల్, కొమ్ము రాజు, దయ్యాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం

జమ్మికుంట: మండలంలోని కోరపల్లిలో గ్రామ దేవతలు భూలక్ష్మీ, మహాలక్ష్మీ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనకు కీ.శే. పల్లె కనకమ్మ, మొగిలయ్యగౌడ్ జ్ఞాపకార్థం పీఎంకే ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె సూజాత ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో విగ్రహాలు, గద్దె నిర్మాణం తదితర వాటి కోసం రూ. ఆరు లక్షల యాభైవేలు ఉత్సవ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. 15న గ్రామంలోని కూడలి వద్ద ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందని, మహా అన్నదానం కార్యక్రమం చేపడతామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్లె తిరుమల రవిగౌడ్, రంజీత్‌గౌడ్‌తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నస్వామి జాతర


ఆలయం ఎదుట పెద్దపట్నం

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి–విజయనగర్‌కాలనీ, నారాయణ్‌పూర్ గ్రామాల మధ్య వెలసిన కోరమీసాల మల్లన్నస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా సాగుతున్న ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం స్వామివారి కల్యాణతంతు నిర్వహించారు. శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట పెద్దపట్నం వేశారు. అగ్నిగుండాల్లో భక్తులు నడిచారు. ఒగ్గుకళాకారుల ఆటపాటలతో స్వామివారి జాతర కనుల విందుగా సాగింది. ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చిగురుమామిడి, కోహెడ మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు పోతరవేని బాలయ్య, మహేశ్, జంగ నర్సయ్య, సంధ్యవేని మల్లేశం, కొమురయ్య, ఉపసర్పంచ్ నరాల లింగం, స్వామి, మల్లయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, వార్డు సభ్యులు విష్ణమాచారి, శ్యామల, ఆకుల శ్రీను, ఎస్‌కె సిరాజ్, డాక్టర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు ఉంటుందని ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తామన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డంతా గుంతలమయం

మానకొండూర్‌రూరల్: మండలంలోని తూర్పుచౌరస్తా నుంచి పల్లెబస్టాండ్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. నిత్యం వందల ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలతో రోడ్డు ధ్వంసమైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారిపేరు : శ్రీనివాస్, జీపీ సెక్రెటరీ
ఫోన్ నంబర్ 79890 67605

కరాటేలో గోల్డ్‌మెడల్

జమ్మికుంట: ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ 2023లో జమ్మికుంట డ్రాగన్ స్కూల్ ఆఫ్ కరాటే క్రీడాకారులు దాట్ల ఆదిత్య, చందుపట్ల అభిరామ్ కటాప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారని కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సంకరి యాదయ్య సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెకండ్ ఇంటర్‌నేషనల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో జరిగిన టోర్నీలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 1,000 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదిత్య, అభిరామ్‌తో పాటు దేమే అనిక్, రాంగుప్తాలు కటాప్, స్పారింగ్ విభాగంలో సిల్వర్ మెడల్, పల్ల విక్రాంత్, సంపంగి వైష్ణవి, ఆరె వర్షిత్ కాంస్య పతకాలు సాధించారు. అంతర్జాతీయ కరాటే మాస్టర్లు అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటిలతోపాటు పలువురు చిన్నారులను అభినందించారు.

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన సుడా చైర్మన్

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామ సర్పంచ్ మర్రి కొండయ్య సతీమణి వనజ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి, వార్డు మెంబర్ బోడ రాజశేఖర్ సోమవారం కొండయ్య కుటుంబ సభ్యు లను పరామర్శించారు. వెంట యాదగిరి, శంకర్, వెంకటేశ్, రవి ఉన్నారు.

క్రైం కార్నర్

పొలంలోకి దూసుకెళ్లిన వ్యాన్

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం వ్యాన్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ రవికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పరిహారం రావడం లేదని ఆత్మహత్యా యత్నం

గంగాధర: మండలంలోని మంగపేటకుచెందిన గంగారెడ్డి(40) ఆత్మహత్యకు యత్నించాడు. నారాయణ్‌పూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూమి కోల్పోతున్నా పరిహారం రావడం లేదని మూడు రోజులుగా మంగపేట చెరువు వద్ద బాధితులతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొంటున్నాడు. సోమవారం చెరువు వద్ద పురుగుల మందు సేవించగా గమనించిన తోటివారు ఆస్పత్రికి తరలించారు.

రాంపూర్‌లో నగదు, బంగారం అపహరణ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఎలిగేటి రాజు ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రాజు భార్య, కొడుకు ఈ నెల 11న దైవ దర్శనానికి వెళ్లి సోమవారం ఉదయం ఇంటికి చేరుకోగా ఇంటి తాళం పగిలి ఉంది. ఇంట్లోని సామన్లు చిందరవందరగా పడేసి ఉండటంతో పాటు బీరువాలోని రూ. 60 వేల నగదు, రెండున్నర తులాల బంగారం దొంగలు అపహరించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రాజన్న తెలిపారు.